విరాళం డీడీని ఆలయ పేష్కార్ రామకష్ణకు అందిస్తున్న దాతలు ఇంద్రనీల్, మహేంద్ర

టిటిడికి రూ.2 కోట్లు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

విశాఖపట్నానికి చెందిన దేవి ఫిషరీస్ సంస్థ ఆదివారం టిటిడి శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1,01,25,000 విరాళంగా అందజేసింది. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్లు ఇంద్రనీల్ చిట్టూరి, మహేంద్ర యార్లగడ్డ తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డిడిని అందజేశారు. బెంగుళూరుకు చెందిన బిల్వ ఇన్‌ఫ్రా సంస్థ టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందజేసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రవీణ్ ఎస్.నాయర్ తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డిడిని అందజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- ఒకరు గల్లంతు

ప్రజాశక్తి - నల్లచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. ఒకరి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నల్లచెరువు మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ బందార్లపల్లి చెందిన రాము (40), ఆయన కుమారుడు చిన్నప్ప (9) హెయిర్ కటింగ్ చేయించుకున్న అనంతరం స్నానం చేసేందుకు సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లారు. నీటి ప్రవాహానికి ఇద్దరూ కొట్టుకు పోయారు. రాము మృతదేహం లభ్యమవ్వగా, గల్లంతైన చిన్నప్ప కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం చిలకట్టుకు చెందిన సమీర్ (28) నల్లచెరువు మండలం కె.పూలకుంట గ్రామానికి చెందిన తన బంధువులు ఇంటికి వచ్చారు. గ్రామ సమీపంలోని చెరువులో స్నానం చేసేందుకు దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయారు. గ్రామస్తులు గమనించి సమీర్‌ను ఒడ్డుకు చేర్చేలోపే ఆయన మరణించారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోన పోర్టు ప్రాజెక్టు గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పు గోదావరి జిల్లాలోని తొండంగి మండలం, కోన గ్రామంలో ప్రతిపాదిత కమర్షియల్ పోర్టు ప్రాజెక్టుకు గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పిపిపి విధానంలో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు 2028 సెప్టెంబరు 16వ తేదీ వరకూ గడువు పొడిగించింది. ఈ మేరకు మౌలిక సదుపాయాలు, పెట్టుబడులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ అభ్యర్థన మేరకు, ప్రస్తుత కమర్షియల్ ఆపరేషన్ తేదీ అయిన 20 జులై 2026 నుంచి 789 రోజులు పొడిగించింది. భూమి కేటాయింపుల్లో జాప్యం, రోడ్డు కనెక్టివిటీ సమస్యలు, విద్యుత్, నీటి సరఫరా మౌలిక వసతుల వంటి కారణాల వల్ల ప్రాజెక్టు పనులు నిర్దిష్ట సమయానికి పూర్తికాలేకపోయినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఎపిఐఐసి, ఎపి మారిటైమ్ బోర్డు, జిల్లా అధికారులతో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై పనులు వేగవంతం చేసి, మరోసారి గడువు పొడిగింపు అవసరం లేకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచించింది.

ఆదివాసీల భాషలను పరిరక్షించాలి

- జయపూర్ సంస్థానాధీశుడు రాజా విక్రమదేవ్ మనవడు విశ్వేశ్వర్‌చంద్ర చూడ్ దేవ్

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

ఆదివాసీల భాషలను పరిరక్షించాలని, వారి మాటను బతికించాలని, వారి స్థితిగతులు, సాహిత్యంపై పరిశోధనలు అవసరం అని జయపూర్ సంస్థానాధీశుడు, రాజా విక్రమదేవ్ మనవడు విశ్వేశ్వర్ చంద్ర చూడ్ దేవ్ పేర్కొన్నారు. రైటర్స్ అకాడమీ, సమతా సాహితి, సిక్కోలు బుక్స్, ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక, సాహితీ స్రవంతి, విశాఖ సంస్కృతి సంస్థల నేతృత్వంలో విశాఖపట్నం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కళింగాంధ్ర లిటరేచర్ ఫెస్టివల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ చంద్ర చూడ్ దేవ్ మాట్లాడుతూ, కళింగాంధ్ర ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దాని చరిత్రను, సాహిత్యాన్ని మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. తమ పూర్వీకులకు కళింగాంధ్రతో ఎంతో అనుబంధం ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య కెఎస్.చలం మాట్లాడుతూ, తెలుగు పదం సాహిత్యం నుంచే పుట్టిందని వివరించారు. కళింగ సీమ చరిత్ర పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, చరిత్రలో లేని అంశాలు అనేకం ఉన్నాయని

మన కళింగాంధ్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తెలిపారు. కళింగాంధ్ర ప్రాంతం అస్తిత్వం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంత ప్రకృతి వనరులు దోచుకునేందుకే కార్పొరేట్ సంస్థలు వస్తున్నాయని, తూర్పు కనుమలు కూడా ఉంటాయో, మాయమైపోతాయో అనే ఆందోళన వ్యక్తం చేశారు. రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలపై కలం ఝుళిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హక్కుల కోసం పోరాటం చేయాల్సి వచ్చినప్పుడు అనుకూలంగా రచనలు రావాలన్నారు. అక్షరంతో కూడా పోరాటం చేయొచ్చని తెలిపారు. సామాన్యులు, రైతులను రోడ్డుమీదికి లాగుతున్న కార్పొరేట్ల వ్యాపార దృక్పథాన్ని ఖండిస్తూ రచనలు రావాలన్నారు.

అనంతరం ప్రసాద్‌మూర్తి రచించిన యుద్ధమే శాంతి, బొబ్బిలి శ్రీధర్ రచించిన గురజాడ అన్నారక్ష, దుప్పల రవికుమార్ రచించిన మన కళింగాంధ్ర, మీరు చదివారా?, పిల్లా తిరుపతిరావు రచించిన పచ్చడం, బాల సుధాకర్ రచించిన జయంత్ పర్మార్ కవిత్వం, హరి వెంకటరమణ రచించిన చిక్కని పులి, ధార రంగనాథం రచించిన నగర రాజం రాజాం పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, బండి సత్యనారాయణ, గంట్యాడ గౌరునాయుడు, అట్టాడ అప్పలనాయుడు, ఆచార్య అప్పారావు, కరుణకుమార్, డాక్టర్ సతీష్‌కుమార్, ఆచార్య వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

3, 4, 5 తేదీల్లో పుచ్చలపల్లి సుందరయ్య స్మారక జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యడ్లపాడు (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో 23వ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు కార్యక్రమాల పోస్టర్‌ను ఆదివారం యడ్లపాడులో పరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, కార్యదర్శి ముత్తవరపు రామారావు, ఉపాధ్యక్షులు జరుగుల శంకరావు, వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, ముత్తవరపు పద్మారావు, బొప్పన్న నరసింహరావు (బుజ్జి), షేక్ బాజి తదితరులు ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరిషత్తుల్లో ఉత్తమ రచనలు, బహుమతులు సాధించిన పది మేటి నాటికలు ప్రేక్షకులను అలరించనున్నాయి. కళాభిమానులను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు ఈసారి వినూత్నంగా ఎంట్రీ కూపన్ల ద్వారా లక్కీడ్రా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించనున్నారు. రంగస్థల, సినీ రంగ ప్రముఖులకు ఘన సత్కారాలు చేయనున్నారు. సుప్రసిద్ధ నటులు, దర్శకులు ఉప్పులూరి సుబ్బరాయశర్మకు ప్రతిష్టాత్మక 'పుచ్చలపల్లి పురస్కారం', తెలుగు అకాడమీ చైర్మన్, పౌరాణిక నాటక రంగంలో విశేష గుర్తింపు పొందిన

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కళారత్న గుమ్మడి గోపాలకృష్ణను పుచ్చలపల్లి సుందరయ్య - 'వేదిక' సంస్థల ఆధ్వర్యంలో సన్మానించనున్నారు. నాటకాల్లో పాల్గొనే ప్రతి మహిళా కళాకారిణిని ఆడపడుచుగా గౌరవిస్తూ సత్కరించడం ఈ సంస్థ ఆనవాయితీగా వస్తోంది.

ప్రదర్శనలు..

తొలిరోజైన ఏప్రిల్ 3న వీరన్నపాలెం వారి 'దీపం కింద చీకటి', విశాఖ వారి '(అ)సత్యం', కాకినాడ బివికె క్రియేషన్స్ వారి 'కన్నీటికి విలువెంత' నాటికలు ప్రదర్శితమవుతాయి. రెండో రోజైన ఏప్రిల్ 4న హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి 'అమ్మ చెక్కిన బొమ్మ', 'స్త్రీ మాత్రే నమః, గుంటూరు శ్రీరమణ కళానిలయం వారి 'మాతృత్వం' నాటికలతో పాటు యడ్లపాడు మానవతా సాగరి బృందం 'మంచివారే.. కానీ' అనే ప్రత్యేక హాస్య నాటికను ప్రదర్శిస్తారు. ముగింపు రోజైన ఏప్రిల్ 5న విజయవాడ సాంస్కృతిక సమితి వారి 'మమ్మల్ని బతకనివ్వండి', కట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి 'మంచి మనసులు', విశాఖ తెలుగు కళాసమితి వారి 'చిటికెన వేలు' నాటికలతో ఈ కళా ప్రదర్శనలు ముగియనున్నాయి. ప్రదర్శన ముగింపు అనంతరం బహుమతి ప్రదానం ఉంటుంది.

బాలుడి దారుణ హత్య

- రాళ్లతో దాడి చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - నందివాడ (కృష్ణా జిల్లా)

కృష్ణాజిల్లా నందివాడ మండలంలో ఆదివారం ఉదయం దారుణ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని పెదలింగాల గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి గండికోట బాలాజీ (10) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... బాలాజీ తన నానమ్మ లక్ష్మి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో బాలాజీ తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వృద్ధురాలైన బాలుడి నానమ్మ లక్ష్మి తీవ్రంగా గాయాలపాలవడంతో స్థానికులు వైద్యం కోసం విజయవాడకు తరలించారు. నందివాడ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రాళ్లతో దాడి చేసిన ఆనవాళ్లు గుర్తించారు. పెదలింగాల గ్రామంలో ఈ హత్య ఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వృద్ధురాలు లక్ష్మీ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. దాడికి కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ (ఫైల్)

ఇరాన్ పై యుద్ధోన్మాదాన్ని ఆపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

అమెరికా, ఇజ్రాయిల్ ఏకపక్ష నిర్ణయంతో ఇరాన్‌పై కొనసాగిస్తున్న దుర్మార్గమైన యుద్ధోన్మాదాన్ని ఆపాలని, మానవత్వం ఉన్న ప్రతి మనిషి ఈ యుద్ధాన్ని ఖండించాలని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో కోరాయి. తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు పి.వెంకటరత్నం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న దాడులను భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఖండించకపోవడం చూస్తుంటే ట్రంప్‌కు మోడీ ఎంతగా సాగిలపడిపోయారో స్పష్టమవుతోందని అన్నారు. భారత ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఇటీవల విశాఖ పట్టణంలో జరిగిన నేవీ పెరేడ్ ఉత్సవాలకు వివిధ దేశాలకు చెందిన నేవీ షిప్పులు పాల్గొనగా, ఇరాన్ నేవీ దళం కూడా

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య

వారి షిప్పులతో పాల్గొని తిరిగి వెళుతున్న సందర్భంగా హిందూ మహాసముద్రంలో, శ్రీలంక సమీపాన ఇరాన్ నేవీ షిప్‌పై ఇజ్రాయిల్ నేవీ దళాలు దాడి చేయడంతో, ఇరాన్ షిప్‌లో ఉన్న 90 మంది నేవీ అధికారులు దుర్మరణం పాలయ్యారని, రక్షణ కల్పించాల్సిన భారత ప్రభుత్వం ఈనాటికీ ఖండించకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సిఐటియు నాయకురాలు లక్ష్మీ, మైనార్టీ నాయకులు ఇసాక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి చిన్నం కాళయ్య, అధ్యక్షులు నాగభూషణం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి శీను, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉదయ్, మహిళా సమాఖ్య నాయకులు జయలక్ష్మి, దళిత నాయకులు హరిబాబు, ధనంజయులు, దేవానందం, బిసి సంఘర్షణ సమితి బి.లక్ష్మయ్య, పౌర సమాజ చైతన్య వేదిక కార్యదర్శి ఎఎన్ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కనిగిరి

మార్కాపురం జిల్లా రాయవరం వద్ద ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి కేశవరావు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబసభ్యులను సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేశవరావు

మృతుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కేశవరావు

మాట్లాడుతూ... ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ.ఐదు లక్షల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి నరేంద్ర, ఏడుకొండలు, పెద్ద తాపీ వలి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వైద్యుని కుటుంబం ఆత్మహత్యాయత్నం

- భార్య, మూడేళ్ల కుమార్తె మృతి
- ప్రాణాపాయస్థితిలో వైద్యుడు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఆదివారం ఉదయం అత్యంత విషాదకర ఘటన వెలుగులోకి వచ్చింది. స్టేషన్ రోడ్డులోని ఒక ప్రైవేటు లాడ్జిలో బస చేసిన ఓ వైద్యుడి కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో భార్య శంకర కుమారి (30), మూడేళ్ల కుమార్తె మౌనిహ ప్రాణాలు కోల్పోయారు. మత్తు మందు వైద్యుడైన భర్త కుంభా గోపి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం... నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన గోపి, ధర్మవరానికి చెందిన శంకర కుమారి కొన్నేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం భోపాల్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా గోపి, నర్సుగా శంకర కుమారి సేవలందిస్తున్నారు. వీరి మూడేళ్ల కుమార్తె మౌనిహ 'డౌన్ సిండ్రోమ్' వ్యాధితో బాధపడుతుండటం ఆ దంపతులను మానసిక ఒత్తిడికి గురిచేసింది. శనివారం రాత్రి భోపాల్ నుండి నరసరావుపేట చేరుకున్న వీరు, లాడ్జిలో గది తీసుకున్నారు. రాత్రి పది గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ మత్తు ఇంజక్షన్లు తీసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. అయితే ఈ నిర్ణయం తీసుకునే ముందు డాక్టర్ గోపి తాను ఉన్న లొకేషన్‌ను, కొన్ని వీడియో సందేశాలను సాతులూరులోని తన తమ్ముడికి వాట్సాప్ ద్వారా పంపారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

లోగో ఆవిష్కరిస్తున్న జి.ప్రసాదరావు, తదితరులు

రైతు సంఘం రాష్ట్ర మహాసభకు సహకరించాలి

- లోగో ఆవిష్కరించిన వ్యవసాయ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసాదరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభకు అందరూ సహకరించి జయప్రదం చేయాలని వ్యవసాయ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. జూన్ 3, 4, 5 తేదీల్లో ఏలూరులో జరిగే మహాసభ లోగోను ఆదివారం ఏలూరులోని పవర్‌పేట అన్నేభవనంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కార వేదికగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు వ్యవసాయం సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందడం లేదని, ఫలితంగా అన్నదాతలు నష్టపోతున్నారని వివరించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న, ఆక్వా, పామాయిల్, కోకో, కొబ్బరి, మిర్చి, కూరగాయలు తదితర ఉద్యాన, వాణిజ్య, ఆహార పంటల సమస్యలపై రైతు సంఘం పోరాటాలు చేస్తోందని తెలిపారు. జూన్ మూడో తేదీన వేలాది మందితో రైతు ప్రదర్శన, బహిరంగ సభ, మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 500 మంది రైతు ప్రతినిధులతో మహాసభ జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర మహాసభ విజయవంతం కోసం రెండు నెలలపాటు గ్రామ గ్రామాన విస్తృత ప్రచార కార్యక్రమాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ఉపాధ్యాయుల హక్కుల కోసం కృష్ణంరాజు పోరాటం

- వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి- ఐ.పోలవరం

ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతం పోరాడిన పొత్తూరి కృష్ణంరాజు ఉపాధ్యాయ ఉద్యమ ఆశాజ్యోతి అని పలువురు కొనియాడారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణంరాజు ప్రథమ వర్ధంతి సభ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రేవు అప్పల స్వామి మాట్లాడారు. జీవితాంతం ఉపాధ్యాయుల హక్కుల కోసం, విద్యా రంగ పరిరక్షణ కోసం కృష్ణంరాజు రాజీలేని పోరాటం చేశారని, ఉపాధ్యాయ సమస్యలకే పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై కూడా నిరంతరం స్పందించేవారని గుర్తు చేసుకున్నారు. కృష్ణంరాజు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జివి.రమణ, కార్యదర్శి ఎంటివి. సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్ వర్మ, సత్తిరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, వడ్డి శాస్త్రి, బాలాజీ, కార్యదర్శి అప్పారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వటపత్రశాయి అలంకారంలో శ్రీరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కోదండ రామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం వటపత్రశాయిగా రాముడుని అలంకరించారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. శ్రీరాముడికి అడుగడుగునా యాత్రికులు కర్పూర హారతులు అందించారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుక నిర్వహించనున్నారు. రాత్రి ఏడు గంటల నుండి భజన బందాల కోలాటాల నడుమ పురవీధుల్లో వాహనసేవ జరిగింది. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నవీన్, ఆలయ అర్చకులు, అధికారులు, యాత్రికులు పాల్గొన్నారు.

1న కల్యాణానికి సిఎం చంద్రబాబు రాక

ఏప్రిల్ 1న నిర్వహించే కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారు. రాష్ట్ర ప్రజల తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలన సమర్పిస్తారు. ఏప్రిల్ 1 సాయంత్రం 4:15 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయ సమీపంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ప్రభుత్వం తరపున అధికారికంగా పట్టువస్త్రాలు, ముత్యాలు, తలంబ్రాలను అందజేస్తారు.

Chola
Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: చోళా క్రెస్ట్, సూపర్ జ, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032.

స్వాధీనత నోటీసు
((అనుబంధం-4) (రూల్ 8(1) క్రింద)

ఏదైతే దిగువసంతకందారు అయిన మెస్సర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి, సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించబడిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపల తదుపరి వడ్డీ మరియు పేర్కొన్న నోటీసులో వివరించబడిన మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీత (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) లను పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి అందించిన అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ క్రింద వివరించబడిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైంది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిమీద వడ్డీ మెస్సర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యుర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

| క్ర సం | రుణగ్